
సాక్షి
పల్నాడు
శనివారం । 11 । అక్టోబర్ । 2025



మానసిక ఆరోగ్యం కీలకం

నకరికల్లు:అంతర్జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాలను కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. మానసిక ఆరోగ్య కౌన్సిలర్ శాంతివర్ధన్ మాట్లాడారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 79,040 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 74,040 క్యూసెక్కులు వదులుతున్నారు.



ఇర్లపాడులో డీఎల్‌పీవో పర్యటన

నాదెండ్ల:ఇర్లపాడు గ్రామంలో శుక్రవారం నరసరావుపేట డీఎల్‌పీవో వీవీఎం లక్ష్మణరావు పర్యటించారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

కోటి సంతకాల ఉద్యమం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- పలుచోట్ల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ
- నేటి నుంచి దశలవారీ ఆందోళన

మాచర్ల: దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేద రోగులు, పేద విద్యార్థుల కోసం 17 మెడికల్ కళాశాలలను వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొస్తే అందులో 10 కళాశాలలు అమ్ముకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. జగన్ పిలుపు మేరకు శనివారం నుంచి నవంబర్ 24వ తేదీ వరకు దశల వారీగా వివిధ కార్యక్రమాలు చేపడతామని, కోటి సంతకాలు సేకరించనున్నామని తెలిపారు. శుక్రవారం రాత్రి తన క్యాంపు కార్యాలయంలో కోటి సంతకాల పోస్టర్లను పీఆర్కే పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ 11 నుంచి నవంబర్ 22 వరకు రచ్చబండ, సంతకాల సేకరణ జరుగుతుందన్నారు. నవంబర్ 12న జిల్లా కేంద్రాలలో ప్రజలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యార్థులతో కలిసి భారీ స్థాయిలో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఆర్కే, వైఎస్సార్ సీపీ నాయకులు

నవంబర్ 24న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కార్యాలయానికి కోటి సంతకాల పత్రాలు అందజేయటం జరుగుతుందన్నారు. వాటిని గవర్నర్‌కు జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోతురెడ్డి కోటిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, పట్టణ అధ్యక్షులు పోలా శ్రీను, రాష్ట్ర, జిల్లా యువజన నాయకులు డి శ్రీనివాసరెడ్డి, నవులూరి చెన్నారెడ్డి, జిల్లా మహిళా విభాగం నాయకురాలు అనంతరావమ్మ, జిల్లా బీసీ యువజన విభాగం నాయకులు పిల్లి కొండలు, జెడ్పీటీసీ పెద్ద మల్లుస్వామి, ఓరుగంటి చిన్నా, దేవళ్ల సాంబశివరావు, కొత్తపల్లి పున్నారెడ్డి, కౌన్సిలర్ మందా సంతోష్, దేవళ్ల సాంబశివరావు, పిన్నెల్లి హనిమిరెడ్డి, కందుకూరి మధు, యేరువ ప్రతాపరెడ్డి, తాళ్లపల్లి ఈశ్వరయ్య, వెంకట్రామయ్య, మోరా రామకృష్ణారెడ్డి, బొంగురు, అగ్గి రాముడు, కంభంపాటి అమర్, మద్దికర శ్రీనివాసరెడ్డి, చల్లా కాశయ్య, చల్లా మోహన్, దేవళ్ల యోగయ్య, గుంజ నాగ అంజి, ధనలక్ష్మి, తిరుమలకొండ దుర్గారావు, బత్తుల శ్రీనివాసరావు, వల్లెపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో....

సత్తెనపల్లి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి పాల్గొని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, అచ్యుత శివప్రసాదు, మౌలాలి, రాయపాటి పురుషోత్తం, ఇందూరి నరసింహారెడ్డి, సతీష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, పార్టీ నాయకులు

న్యూస్‌రీల్

నేడు మిస్ ఇండియా అమూల్య ప్రియదర్శినికి సన్మానం



సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణానికి చెందిన అమూల్య ప్రియదర్శిని మిస్ ఇండియాగా మూడోస్థానం కైవసం చేసుకుని తొలిసారి శనివారం సత్తెనపల్లి రానున్నారు. ఇటీవల గోవాలో జరిగిన అందాల పోటీల్లో ఆమె తెలంగాణ నుంచి పాల్గొని మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచ మిస్ యూనివర్స్ పోటీల్లో భారతదేశం నుంచి ఆమె పాల్గొన్నారు. గతంలో మిస్ హైదరాబాద్ కైవసం చేసుకున్నారు. ఆమె తాతయ్య చిలుకా రమేష్ సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారిగా గతంలో పని చేశారు. ఆమె రాకను పురస్కరించుకుని పార్క్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని హోటల్ కార్తికేయ ఫంక్షన్ హాలులో సాయంత్రం 4 గంటలకు సన్మానం చేయనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాది చలువాది చినసత్యనారాయణ, మిత్ర బృందం తెలిపింది.

జిల్లాకు 1970 మెట్రిక్ టన్నుల యూరియా




నాదెండ్ల: సాతులూరులోని రైల్వే ఎరువుల రేక్ పాయింట్‌ను శుక్రవారం పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు పరిశీలించారు. జిల్లాకు ఎస్‌ఎఫ్‌ఎల్ యూరియా 1970 మెట్రిక్ టన్నులు వచ్చినట్టు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైనంత మేర యూరియా అందుబాటులో ఉందన్నారు. రేక్ పాయింట్ నుంచి సొసైటీలు, డీలర్లకు దామాషా ప్రకారం యూరియా పంపిణీ చేయాలని ఏవోలను ఆదేశించారు. ఆయన వెంట ఏడీఈ కేవీ శ్రీనివాసరావు, ఏవో శ్రీలత ఉన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి



తాడేపల్లి రూరల్ : కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం వడ్డేశ్వరంలోని ఐద్వా కార్యాలయంలో ఐద్వా రాష్ట్ర 16వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో జరగనున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి. శ్రీనివాసకుమారి, కె.శ్రీదేవి, అమలాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి కోళ్లూరు ప్రసన్నాంజనేయుని దీక్షలు



బెల్లంకొండ: బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద ఉన్న కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి మాల ధారణ కార్యక్రమాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా నరసింహాచార్యులు, అనంతాచార్యులు తెలిపారు. కార్తిక మాసంతో పాటు హనుమత్ వ్రత కార్యక్రమం సందర్భంగా మండల కాల దీక్షలు 23 వరకు ఉంటాయన్నారు. అర్ధ మండల కాల దీక్షలకు నవంబర్ 9 నుంచి 11 వరకు మాలధారణ జరుగుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 3న ప్రసన్నాంజనేయుని హనుమత్ వ్రత మహోత్సవ వేడుకలు జరుగుతాయని తెలిపారు.

ఈ-వేస్ట్ సేకరణ



సత్తెనపల్లి: ఈ-వెస్ట్ (ఎలక్ట్రానిక్) ను మున్సిపల్ వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనందకుమార్ శుక్రవారం తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గృహాల్లో పాడైన బ్యాటరీలు, టీవీలు, వాషింగ్ మిషన్లు, ఫ్రిజ్‌లు, రైస్ కుక్కర్లు, మొబైల్ ఫోన్లు, మిక్సీలు, బల్బులు, ఎలక్ట్రానిక్ షాపుల్లో పాడైన కంప్యూటర్లు, ప్రింటర్లు, కీబోర్డులు, తదితర ఈ-వేస్ట్‌ను పురపాలక సంఘంలోని ప్రత్యేక కౌంటర్ నందు సేకరించడం జరుగుతోందన్నారు.

మెడికల్ ప్రైవేటీకరణపై రచ్చబండ

నరసరావుపేట:ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే యోచనపై పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను నాయకులు, కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణలో నియోజకవర్గం నుంచి 60 వేల సంతకాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్లు, న్యాయవాదులు, వ్యాపారులు, రైతులు, విద్యార్థులు, యువజనులను భాగస్వామ్యం చేయాలన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పడాల శివారెడ్డి, ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఇయం.స్వామి, సంయుక్త కార్యదర్శులు పాలపర్తి వెంకటేశ్వరావు, కనకా పుల్లారెడ్డి, గంటినపాటి గాబ్రియేలు, జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, డ్వాక్రా విభాగ జిల్లా కార్యదర్శి హెల్దా ఫ్లోరెన్స్, పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, న్యాయవాదులు వై.సీతారామిరెడ్డి, బ్లెసీనా, జీనేపల్లి హనుమంతరావు, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి ఉప్పతోళ్ల వేణుమాధవ్, జిల్లా ఎస్సీ విభాగం కార్యదర్శి కందుల ఎజ్రా, పట్టణ వర్కింగ్ అధ్యక్షులు నిడమానూరి సురేంద్ర, అచ్చి శివకోటి, జిల్లా కోశాధికారి అన్నా మోహన్, మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, పట్టణ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ సిలార్‌బాషా, ఎస్సీ విభాగం పట్టణ కార్యదర్శి పొలయ్య, పచ్చవ రవీంద్రబాబు, ఖాదర్‌బాషా, ఫణీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

రచ్చబండ ద్వారా ప్రభుత్వ విధానాలను ఎండగడదాం

- మాజీ మంత్రి విడదల రజిని
- కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ

చిలకలూరిపేట:రచ్చబండ ద్వారా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి నివాసంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రజాఉద్యమ కార్యక్రమం పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలసి శుక్రవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ 45 రోజులపాటు గ్రామ స్థాయి వరకు ప్రజా ఉద్యమం ప్రారంభించిందని తెలిపారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ వైద్యకళాశాలల నిర్మాణం చేపట్టారని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్య దూరం చేసేలా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలా ల అధ్యక్షులు షేక్ దరియావలి, దేవినేని శంకరరావు, వడ్డేపల్లి నరసింహారావు, మంగు ఏడుకొండలు, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఏకాబరపు సునీత, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

కల్తీ మద్యంపై సీబీఐచే విచారణ చేయించాలి

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో వెలుగుచూసిన అక్రమ కల్తీ మద్యం, మరణాలపై వెంటనే సీబీఐతో విచారణ చేయించి దోషులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కల్తీ మద్యం రాకెట్ ప్రభుత్వ పెద్దల సహకారం లేనిదే జరగదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నారా వారీ అక్రమ మద్యం ప్రజలకు తాగునీరు కంటే చాలా సులభంగా లభ్యమౌతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దారుణంగా 70 వేల బెల్టుషాపులు నడిపిస్తున్నారన్నారు. అన్నమయ్య జిల్లా ములకల చెరువులో మూడు మెషీన్లతో నెలకు 45లక్షల బాటిళ్ల కల్తీ సారా తయారుచేయించి వివిధ బ్రాండ్ల లేబుళ్లు అంటించి మద్యం, బెల్టుషాపులకు సరఫరా చేశారన్నారు. సుమారుగా రూ.4,800 కోట్లు మద్యం ప్రియుల నుంచి కొల్లగొట్టారన్నారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు, ఎక్సైజ్ శాఖలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. కల్తీ మద్యం తయారుచేసేందుకు ఇన్ని వేల లీటర్ల స్పిరిట్ ఎక్కడ నుంచి వచ్చిందని ప్రశ్నించారు. ఒక హాస్పిటల్‌లో స్పిరిట్ వాడాలంటే డ్రగ్ లైసెన్స్ తీసుకొని వాడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ పెద్దల సహకారం లేనిదే ఇంత భారీగా స్పిరిట్ లభ్యం కాదని, ఖచ్చితంగా దీని వెనుక ఎవరున్నారనేది తేలాల్సిన అవసరం ఉందన్నారు. దీని వెనుక రాష్ట్ర పెద్దలే ఉన్నారు కాబట్టి వారు చేయించే దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని అన్నారు. తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి వైఎస్సార్ సీపీ కోవర్టు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు అంటూ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే పనిలో టీడీపీ మీడియా పనిచేస్తుందన్నారు. ఇంత ఘోరమైన స్కామ్ వారు చేస్తూ ఎటువంటి స్కామ్‌కు ఆస్కారంలేని గత ప్రభుత్వ మద్యం విధానంపై తప్పుడు కేసులు పెట్టి తమ పార్టీ నాయకులను జైళ్లపాలు చేశారన్నారు. ఎన్నికలకు ముందు మద్యం తాగేవారి కడుపుపై కొట్టారని మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని అన్నారు. ప్రభుత్వ పెద్దలకు ముడుపులు అందుతున్నందునే వారు మాట్లాడటం లేదని, సీబీఐచే విచారణ చేయించి ప్రజలకు వాస్తవాలు తెలియచేయాలని డిమాండ్ చేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి

పెట్రోలు, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గిస్తావు లోకేష్..

ఎన్నికలకు ముందు లోకేష్ పాదయాత్ర చేస్తూ తాము అధికారంలోకి వస్తే ఇతర రాష్ట్రాలతో సమానంగా రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అవుతున్నా ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఎక్కువగానే ఉందని అన్నారు. మన రాష్ట్రంలో పెట్రోలు రూ.109.50, డీజిల్ రూ.97.50 ఉంటే కనీసం రూ.6 నుంచి రూ.9 వరకు ఇతర రాష్ట్రాల్లో తక్కువగా ధరలు ఉన్నాయన్నారు. జీఎస్టీ తగ్గించటమనేది కేంద్ర ప్రభుత్వం చేసిన పనైతే టీడీపీ నాయకులు ఊరూవాడా తామే చేసినట్లుగా చెప్పుకుంటూ సభలు, సమావేశాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజంగా టీడీపీ వారికి ప్రజలకు మేలు చేయాలని ఉంటే రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు పక్కనే ఉన్న కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణా స్థాయికి తగ్గించాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ వలన కేవలం కొన్నింటికే రేట్లు తగ్గాయన్నారు. పెట్రోలు, డీజిల్ తగ్గితే మిగతా వాటి రేట్లు కూడా తగ్గుతాయని, తద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై విషప్రచారం తప్పితే వీరు చేసిందేమీలేదని అన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంకుపై రాజకీయ నీడలు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ట్యాంకు పనులు పూర్తి
- జనవరిలో పైపులైన్‌కు శంకుస్థాపన
- పది నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- స్థానిక ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న కూటమి ప్రజాప్రతినిధులు

నరసరావుపేట: ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంలో చొరవ చూపాల్సిన కూటమి నేతలు రాజకీయ లబ్ధి కోసం వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పట్టణంలో సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు, డిస్ట్రిబ్యూషన్ పైపులైను వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. దీంతో సుమారు పది నుంచి 15వేల మంది ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మాణం ప్రారంభమైన ఓవర్ హెడ్ ట్యాంకును వచ్చే స్థానిక మున్సిపల్ ఎన్నికల నాటికి ప్రారంభించి తామే ఏర్పాటు చేశామంటూ ఓట్లు కొల్లగొట్టేందుకు కూటమి ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అమృత పథకం(అటల్ మిషన్ ఫర్ రెజునేవేషన్ ఆఫ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్) కింద నరసరావుపేట పురపాలక సంఘానికి గత ప్రభుత్వంలో రూ.5 కోట్లు కేటాయించింది. వివిధ అభివృద్ధి పథకాలు చేపట్టగా మిగిలిన సుమారు రూ.కోటి నిధులతో శ్రీనివాసనగర్, ఇస్లాంపేట, కోటప్పకొండరోడ్డుతోపాటు రవీంద్రనగర్, ఆ మార్గంలోని పలు ఏరియాలలో నివాసం ఉండే వారికి తాగునీరు అందజేసేందుకు మార్కెట్ యార్డులో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 2023లో శంకుస్థాపన చేశారు. ఇప్పుడా ఆ రాయి కన్పించకుండా చేయటం గమనార్హం. యల్లమంద పంచాయతీ పరిధిలోని ప్రాంతాన్ని పురపాలక సంఘంలో కలుపుతూ తీసుకున్న నిర్ణయంతో అనేక నివాస ప్రాంతాలకు ఈ తాగునీరు అందాల్సి వుంది. గత ప్రభుత్వం దిగిపోయే నాటికి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తయింది. దీని నుంచి నీరు అందజేసేందుకు చేపట్టిన డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి వుంది. గతేడాది కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆర్నెల్లుపాటు పట్టించుకోని స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ఏడాది జనవరిలో సుమారు రూ.44 లక్షల ఖర్చుతో డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. 10 నెలలు కావొస్తున్నా ఆ పనులు ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికే వెంకటరెడ్డికాలనీలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు నుంచి ఆయా ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుంది. దీని వలన సక్రమంగా నీరు అందక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది నూతనంగా ఇళ్లకు నీటి కుళాయిలు ఏర్పాటుచేసుకున్నా నీరు సక్రమంగా అందట్లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. వచ్చే మున్సిపల్ ఎన్నికల నాటికి పైపులైను నిర్మాణం పూర్తిచేసి నీటిని పంపిణీ చేయాలనే ఆలోచనలో కూటమి నేతలు ఉన్నట్లుగా తెలియవచ్చింది. తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత త్వరగా నీటి సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



డిస్ట్రిబ్యూషన్ పైపు లైను నిర్మాణం కోసం ఈఏడాది జనవరిలో వేసిన శిలాఫలకం



మార్కెట్ యార్డులో నిర్మాణం పూర్తి చేసుకున్న వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంకు

పైపుల కోసం ఎదురుచూస్తున్నాం



పైపులైను నిర్మాణం కోసం వినియోగించే హెచ్‌డీ పైపులకు ఆర్డర్లు ఇవ్వటం జరిగింది. అవి రాష్ట్రంలో శ్రీకాళహస్తిలోని ఫ్యాక్టరీలోనే తయారవుతాయి. అవి రాగానే పైపులైను నిర్మాణం చేసి నూతన ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు కుళాయిలు మంజూరుచేసి తాగునీరు అందజేస్తాం.

–డి.రవికుమార్, మున్సిపల్ ఇంజినీరు

పేదలకు అందని ఉచిత వైద్యసేవలు

- డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవలు బంద్
- బకాయిలు చెల్లించేవరకు నిలిపివేస్తున్నట్లు నెట్‌వర్క్ ఆస్పత్రుల వెల్లడి
- వైద్యసేవల కోసం పేదల అగచాట్లు

గుంటూరుమెడికల్: గుంటూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పేదలకు ఉచిత వైద్య సేవలు నిలిచిపోయాయి. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా వైద్య సేవలు అందించిన నెట్‌వర్క్ ఆసుపత్రులకు కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదు. ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలను నిలిపివేశారు. బంద్ పాటించారు. జిల్లా వ్యాప్తంగా 154 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. వీటిల్లో 33 ప్రభుత్వ, 121 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. అసోసియేషన్ పిలుపు మేరకు గుంటూరులోని పలు ఆసుపత్రులు బంద్ పాటిస్తున్నట్లు ఫ్లెక్సీలు ప్రదర్శించాయి.

రెండో సారి విచారణకు హాజరైన పీఆర్కే, పీవీఆర్

మాచర్ల బోదిలవీడు సమీపంలో ఐదు నెలల కిందట జరిగిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్య కేసులో విచారణకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు శుక్రవారం రెండోసారి హాజరయ్యారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ మాచర్ల రూరల్ పోలీసులు వారికి నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రూరల్ సర్కిల్ కార్యాలయానికి విచారణ నిమిత్తం హాజరయ్యారు. శుక్రవారం ఉదయం10.30 నుంచి రాత్రి 7గంటల వరకు గురజాల డీఎస్పీ జగదీష్, రూరల్ సీఐ నఫీజ్ బాషాతోపాటు ఇతర అధికారులు వారిని విచారించారు.

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకు భోజనం విరామమిచ్చారు. అనంతరం విచారణ కొనసాగించారు. రూరల్ పోలీసుస్టేషన్ ముందు పోలీసులు భారీగా మోహరించారు. బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు నుంచి పీఆర్కే ఇంటి వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆ మార్గంలో పార్టీ నాయకులను, కార్యకర్తలను అనుమతించలేదు.



విచారణకు హాజరైన పీఆర్కే, పీవీఆర్

అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యం

వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన ఇరువురిని టీడీపీ అంతర్గత పోరుతో హత్య జరగగా తనపైన, తన సోదరుడుపైన అక్రమంగా కేసు నమోదు చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. విచారణకు వెళ్లి వచ్చిన అనంతరం శుక్రవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టులో మధ్యంతర బెయిల్ పొంది ఉన్న తాము కోర్టు ఆదేశాల మేరకు రెండోసారి విచారణకు హాజరైనట్లు వెల్లడించారు. ఈ హత్యకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. పోలీసుల విచారణకు ఎప్పుడు పిలిచినా వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అక్రమ కేసులు పెట్టేందుకు ఈవిధంగా చేస్తున్నారన్నారు.

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	42,595
అమ్మకాలు	41,281
నిల్వ	11,715



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-15,000
నంబరు-5	10,000-14,000
273	10,500-12,500
341	10,000-15,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-15,200
నంబరు-5	10,000-14,200
341	10,000-15,500
4884	10,000-14,500
సూపర్-10	11,000-14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,200
బాడిగ-355	10,500 - 15,500
దేవనూరు డీలక్స్	10,000 - 14,500
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,200
బాడిగ - 355	10,000-15,500
దేవనూరు డీలక్స్	10,500-14,500
తాలు	5,300 - 7,700

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 259

కొమ్ములు : 175 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,460	10,560	10,560

కాయలు : 84 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,560	10,560

మొత్తం అమ్మకాలు : 194.25 క్వింటాళ్లు

-దుగ్గిరాల

యువకుడు మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. సత్తెనపల్లి మండలం కంటిపూడి గ్రామానికి చెందిన కారసాల ప్రమోద్ (30) యూకేలో ఉద్యోగం చేస్తున్నాడు. మూడు నెలల కిందట స్వగ్రామం కంటిపూడి వచ్చాడు. ఈ నెల 8న ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి నుంచి కంటిపూడి వెళుతుండగా, నందిగామ అడ్డరోడ్డు వద్ద బస్సును ఓవర్ టేక్ చేస్తుండగా, ఎదురుగా వస్తున్న విద్యుత్ శాఖకు చెందిన వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రమోద్‌ను సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో ఇళ్లు పంపిణీకి సిద్ధం

- 23న లబ్ధిదారులకు స్వాధీనం చేస్తాం
- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



మాట్లాడుతున్న కలెక్టర్, వేదికపై ఎమ్మెల్యే అరవిందబాబు, అధికారులు

నరసరావుపేట: మున్సిపాలిటీ పరిధిలో 199 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. కలెక్టర్ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి శుక్రవారం పురపాలక సంఘ పరిధిలోగల టిడ్కో హౌసింగ్ కాలనీ, వినుకొండరోడ్డులోని జగనన్నకాలనీలను సందర్శించారు. టిడ్కో గృహ సముదాయంలో లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈనెల 23 నాటికి మరిన్ని ఇళ్లను జతచేసి 200కు పైగా ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయనున్నామని చెప్పారు. స్వాధీన పరుచుకున్న ఇళ్లలో ఖచ్చితంగా ఎవరో ఒకరు నివాసం ఉండేలా చూడాలని లబ్ధిదారులను కోరారు. నివాసం లేకపోతే అసాంఘిక కార్యకలాపాలకు కాలనీలు నెలవుగా మారే అవకాశం ఉంటుందన్నారు. కోర్టు కేసుల్లో పెండింగ్‌లో ఉన్న మరో 270 ఇళ్లకు సంబంధించి కూడా త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రుణాలు మంజూరు కాని 300 మందికి పైగా లబ్ధిదారులకు అన్ని బ్యాంకుల ద్వారా క్యాంపు ఏర్పాటుచేసి రుణాలు మంజూరు చేసి మరీ ఇళ్లు స్వాధీనం చేస్తామన్నారు. సేల్ డీడ్ రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు 23 నాటికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే నివాసం ఉంటున్న లబ్ధిదారుల నుంచి కాలనీలో సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కాలనీలో వీధిదీపాలకు సాయంత్రంలోగా మరమ్మతులు చేయిస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సకల సదుపాయాలతో టిడ్కో కాలనీ తీర్చిదిద్దామని దీనికి కృషిచేసిన ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలుపుతూ మిగిలిన వారికి కూడా టిడ్కో గృహాలను స్వాధీనం సత్వరమే చేయాలని కోరారు.

అర్బన్ హౌసింగ్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి

వినుకొండ రోడ్డులోని అర్బన్ హౌసింగ్ లేఅవుట్ (జగనన్న కాలనీ)లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కాలనీలో పర్యటించిన ఆమెకు కాలనీ ఏర్పాటు, అందులోని పరిస్థితులను ఎమ్మెల్యే, అధికారులు వివరించారు. రహదారులు బాగాలేవని, మురుగు కాలవల నిర్మాణం చేపట్టాలని, విద్యుత్తు లైన్లను వేయించాలని స్థానికులు కోరారు. ఆ సమస్యలు విన్న కలెక్టర్ తహసీల్దారు, పంచాయతీ అధికారులు, ఎలక్ట్రికల్ సిబ్బందిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, అధికారులు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు రూ.5.07 కోట్లు కేటాయింపు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి

నరసరావుపేట రూరల్: స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో పల్నాడు జిల్లాకు రూ.5.07 కోట్లు కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కేటాయించారని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి పేర్కొన్నారు. శుక్రవారం కోటప్పకొండ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం గ్రామనిధి అనే పోర్టల్ ప్రారంభించిందని, దీని ద్వారా జిల్లాలోని 26 మండలాలకు మండలానికి రూ.19.50 లక్షల చొప్పున మంజూరు చేశారన్నారు. గ్రామ సంఘాలలోని స్వయం సహాయక సంఘాల వారు అవసరం మేరకు దానిని గ్రామనిధి పోర్టల్‌లో అప్‌లోడు చేసుకోవాలని తెలియజేశారు. జిల్లా సమాఖ్య ప్రతినిధులు అందరూ కలిసి స్వయం సహాయక సంఘాలకు గ్రామ సంఘం అసిస్టెంట్‌లుగా మహిళలు మాత్రమే కొనసాగాలని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజని ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ సంఘం అసిస్టెంట్‌గా మహిళలు ఉంటే ఏవిధమైన సమాచారమైన చెప్పుకోవటానికి అభ్యంతరాలు ఉండవని జిల్లా సమాఖ్య ప్రతినిధులు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి తెలియచేశారు. ఏపీడీ రాజా ప్రతాప్, డీపీఎంలు మల్లీశ్వరి, శ్రీనివాస్, డేవిడ్ పాల్గొన్నారు.

తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన నలుగురికి జైలు

బొల్లాపల్లి: అటవీ శాఖ భూములను తప్పుడు డాక్యుమెంట్లతో కాజేసిన నలుగురు వ్యక్తులకు వినుకొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.... 2013లో అప్పటి తహసీల్దార్ నిర్మలాదేవి, వీఆర్వో ఎ.వెంకటేశ్వర్లు, దార మల్లికార్జునరావు, అతని భార్య వెంకటశేషమ్మ, ముప్పాళ్ల వెంకటేశ్వర్లు కలసి మండలంలోని పేరూరుపాడు గ్రామంలోని సర్వే నెంబర్ 329/3లో ఉన్న అటవీ భూములకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పట్టాదారు పాస్ పుస్తకాలు పుట్టించి, బ్యాంకులలో రుణాలు పొందారు. వారిపై స్టీఫెన్‌బాబు అప్పటి నరసరావుపేట ఆర్డీవో పి అరుణబాబుకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై మన్మధరావు కేసు నమోదు చేయగా, తదుపరి వచ్చిన ఎస్ఐ పి నారాయణస్వామి కేసు విచారణ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షుల విచారణ అనంతరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఆర్ ఆశీర్వాదం పాల్ తీర్పు వెలువరించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్షతోపాటు, రూ.1.30 లక్షల జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు. కోర్టు తదుపరి నరసరావుపేట ఆర్డీఓ, బొల్లాపల్లి తహసీల్దార్‌కు పట్టాదారు పాస్ పుస్తకాలు, భూమి యాజమాన్య హక్కు పత్రంలు రద్దు చేయాలని, తగు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి ఆర్ ఆశీర్వాదం పాల్ తీర్పులో పొందుపరచారని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

జాతీయ పికిల్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గుంటూరువెస్ట్(క్రీడలు): బెంగళూరులో శనివారం నుంచి జరగనున్న జాతీయ ఓపెన్ పికిల్ బాల్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన కె.అరుణ్ కుమార్, పి.ఆనంద్‌కుమార్, విన్సెంట్ ఎంపికయ్యారని జిల్లా సంఘం చైర్మన్ టి.అరుణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీవీవీ హెల్త్ హబ్‌లో వారు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. క్రీడాకారులను అరుణ్‌కుమార్,జిల్లా సంఘం అధ్యక్షుడు టి.హరికిషన్ అభినందించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఈత దోహదం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈతతో మెరుగైన శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం శ్యామలా నగర్‌లోని ఈత కొలనులో కానాల అంజనీ శ్రీకాంత్ రెడ్డి స్మారక 8వ మాస్టర్స్ అంతర్ జిల్లాల పోటీలు జరిగాయి. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం ఏదో ఒక క్రీడలో సాధన చేయాలన్నారు. యోగా కూడా ఎంతో మేలు చేస్తుందని వెల్లడించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది రమణ రావు మాట్లాడుతూ 20-90 ఏళ్ల వరకు వయస్సున్న వారికి ఈ పోటీలను ఏటా మాదిరిగానే నిర్వహించామన్నారు. 180 పాల్గొన్నారన్నారు. పోటీలను ఉదయం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గల్లా మాధవి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులు ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రేయసిని మర్చిపోలేక ప్రేమికుడు ఆత్మహత్య

గుంటూరురూరల్: తనకు వివాహమైనప్పటికీ ప్రేయసిని మర్చిపోలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాసరిపాలెం కాలనీకి చెందిన చిలకా చంటి (24) స్థానికంగా ఒక యువతిని ప్రేమించాడు. పలు కారణాలతో స్థానికంగా ఉండే బంధువుల కుటుంబంలోని యువతిని ఈ ఏడాది ఆగష్టులో వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజులుగా ప్రేయసిని మర్చిపోలేకపోతున్నానని, ఆమె గుర్తుకొస్తోందని భార్యతో చెప్పాడు. ఈ క్రమంలో గురువారం ఇంటి పక్కన రేకుల షెడ్డులోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు వచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కారంచేడు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డెప్యూటీ ఈఓ, ఉపాధ్యాయులు

కారంచేడు: త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కారంచేడు విద్యార్థులు ఎంపికయ్యారు. ఒంగోలులో ఈ నెల 7న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలకు కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 60 కేజీల బాలికల విభాగంలో భవ్యశ్రీ , బాలుర విభాగంలో బి. సుదీప్‌కుమార్ ఎంపికయ్యారు. 55 కేజీల విభాగంలో కె. దుర్గ ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను శుక్రవారం చీరాల డిప్యూటీ ఈఓ కె. గంగాధర్ అభినందించారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి గ్రామానికి, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పాఠశాల పీడీ షేక్ మస్తాని, ప్రధానోపాధ్యాయురాలు ఎం. సామ్రాజ్యాన్ని అభినందించారు.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నవీన్ కుమార్ తదితరులు

పెదకాకాని: విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగి పరిశ్రమలను స్థాపించాలని, వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టి విజయవంతం కావాలని పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి ఎం .నవీన్ కుమార్ అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలోని మెకానికల్ ఇంజినీరింగ్, ఐఈఐ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు 'ఆమేయా -2కే25' ముగింపు వేడుకలకు శుక్రవారం ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి ఎం .నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవ ప్రపంచ నైపుణ్యాలను నేర్చుకోవడానికి, పరిశ్రమలకు తగ్గట్టు సన్నద్ధం అవటానికి విద్యార్థి దశ కీలకమన్నారు. మొబైల్ యాప్‌లను వినియోగించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా వాటి తయారీపై దృష్టిసారించాలని సూచించారు. సదస్సులో జిగ్ టెక్, పేపర్ అండ్ పోస్టర్ ప్రజెంటేషన్, ఆర్‌సీ కార్నేజ్, పిక్టో, క్రిక్ క్విజ్ వంటి సాంకేతిక పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, సంధానకర్త వి.కిరణ్ కుమార్, ఐఈఎం విద్యార్థి విభాగ సభ్యులు ఎస్.పవన్ సాయి, సీహెచ్ విష్ణు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి



గ్రామంలో డ్రైయిన్‌లు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రవి, జిల్లా మలేరియా అధికారి రత్నాకర్

రెంటచింతల: స్థానిక పీహెచ్‌సీ కేంద్రానికి వివిధ రకాల వ్యాధులతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.రవి వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం జిల్లా మలేరియా అధికారి రత్నాకర్‌తో కలసి ఆకస్మికంగా సందర్శించారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షల గురించి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం జ్వరాల సీజన్ కాబట్టి ల్యాబ్ టెక్నిషియన్లు నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో వస్తున్న జ్వరం కేసుల వివరాలను మెడికల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలు(ఓపీ) నమోదు, ఆస్పత్రిలో రోగులకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు, రక్త పరీక్షల వివరాలు, మందులు ఇచ్చే విభాగం పనితీరు, వివిధ రికార్డులు పరిశీలించారు. అనంతరం రెంటచింతల గ్రామంలోని పలు ప్రాంతాలలో పర్యటించి ఫ్రైడే డ్రైడేను పరిశీలించి స్థానిక ఆరోగ్య సిబ్బందికి విష జ్వరాలపై పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు, మలేరియా సూపర్‌వైజర్ సీహెచ్ అంకమ్మరావు, ఎంపీహెచ్‌ఈఓ ఏడీ శర్మ, ఎ.ఆంజనేయులు, హెల్త్ అసిస్టెంట్ షేక్ ఖాసింసా, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం అందజేస్తేనే భూములు ఇస్తాం



ఇన్‌చార్జి ఆర్డీవో రమాకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కేసానుపల్లి గ్రామ రైతులు

నరసరావుపేట రూరల్: న్యాయమైన పరిహారాన్ని అందజేస్తేనే భూ సేకరణకు సహకరిస్తామని కేసానుపల్లి గ్రామ రైతులు స్పష్టంచేశారు. చీరాల ఓడరేవు-నకరికల్లు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూసేకరణ కోసం శుక్రవారం కేసానుపల్లి గ్రామ రైతులతో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సమావేశం నిర్వహించారు. సమావేశానికి భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులు హాజరయ్యారు. జాతీయ రహదారి నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. భూములు కోల్పోయే రైతులకు ఎకరానికి రూ.80 లక్షలు చొప్పున పరిహారం అందిస్తామని జేసీ తెలిపారు. జేసీ ప్రతిపాదనకు భూ నిర్వాసితులు అంగీకరించలేదు. గతంలో నిర్వహించిన సమావేశాల్లో ప్రకటించిన విధంగా ఎకరానికి రూ.1.60 కోట్లు పరిహారం చెల్లించాలని కోరారు. గ్రామానికి చెందిన 42 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందని, ఇందులో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉన్నారని వివరించారు. ఆ భూములనే నమ్ముకున్న రైతులు భూసేకరణ ద్వారా జీవనాధారం కోల్పోతారని పేర్కొన్నారు. గతంలో చెప్పిన పరిహారంలో సగం ధరకే ఇప్పుడు భూములు ఇవ్వాలని అధికారులు చెప్పడాన్ని తప్పుపట్టారు. న్యాయమైన పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతూ రైతులను అధికారులు అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కామినేని రామారావు, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహానికి రీపోస్టుమార్టం



పోస్టుమార్టం సందర్భంగా హాజరైన తహసీల్దార్ వి.వి.నాగరాజు

క్రోసూరు: నెల రోజుల కిందట మృతి చెందిన వృద్ధురాలు చిలకా ఆరోగ్యమ్మ(96) మృతదేహానికి శుక్రవారం రీ పోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దార్ వి.వి.నాగరాజు తెలిపిన వివరాల మేరకు మృతురాలు నరసరావుపేటలో నివసిస్తూ అక్కడే నెల కిందట మృతి చెందింది. అయితే ఆమెను క్రోసూరు క్రైస్తవ సమాధుల్లో పూడ్చిపెట్టటం జరిగింది. ఆమె భర్త చాలా కాలం కిందట మృతి చెందాడు. ఆమె మృతి పట్ల అనుమానం వ్యక్తపరుస్తూ ఆమె కోడలు రూతమ్మ నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అక్కడి ఎస్ఐ సీహెచ్ కిషోర్ రీ పోస్టుమార్టంకు ఏర్పాటు చేయగా తహసీల్దార్ పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో బ్రహ్మనాయుడు, సిబ్బంది, మృతురాలి బంధువులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వీరరాఘవయ్య



సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ రసూల్ బృంద సభ్యులు

రేపల్లె: విద్యార్థి దశ నుంచే ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచి చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య సూచించారు. ప్రథమ చికిత్స, సీపీఆర్‌లపై పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గుంటూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరరాఘవయ్య మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారు వైద్యశాలకు వెళ్లేలోపు ప్రథమ చికిత్స వల్ల కొంత మేర వైద్యం అందుతుందని, దీనివల్ల రక్షణ లభిస్తుందని తెలిపారు. ఎవరైనా గుండెపోటుకు గురైతే వైద్యశాలకు వెళ్లే ముందు సీపీఆర్ అందిస్తే అతను బతికేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. వివిధ సందర్భాల్లో గాయపడిన వ్యక్తులకు అందించే ప్రథమ చికిత్సలు, గుండెపోటు వచ్చిన సమయంలో అందించే సీపీఆర్‌ని గుంటూరు రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్ రసూల్ బృంద సభ్యులు ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్, కోఆర్డినేటర్ బుజ్జిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కళాశాలలో ఆర్కే నారాయణ్ జయంతిని నిర్వహించారు. ఆయన సాహితీ సేవలను విద్యార్థులకు వివరించారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐసీడీఎస్, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు బాలికా హక్కులు, సమాన అవకాశాలు, శక్తి వికాసంపై వ్యాస రచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా శక్తి వికాస్ సెల్ ఇన్‌చార్జ్ సుభాషిణి, సీడీపీవో సుచిత్ర, సీఆర్‌ఏఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ హిమబిందు, టి.రాధిక, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హాకీ జట్టు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బాపట్ల టౌన్: మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్- 14 బాలబాలికల హాకీ టీంను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం. గోపి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. పోటీలకు బాలురు 18, బాలికలు 18 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరంతా ఈనెల తిరుపతి జిల్లాలోని చంద్రగిరిలో జరిగే 69వ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 డి. ప్రసాదరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వి.కృష్ణారావు, ఉపాధ్యాయులు బి. గంగాధర్, ఎం. సాంబశివరావు, వాణీ సుశీల, ఏ.టి. రాంబాబు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలి

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా తపాలా ఉద్యమ జాతీయ నాయకుడు మహదేవయ్యను విధుల నుంచి తొలగించిందని, వెంటనే ఆయన్ను ఉద్యోగంలోకి తీసుకోవాలి ఏఐజీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు ఎస్.వి. రాఘవేంద్రలు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పోస్టాఫీసు వద్ద గురువారం ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుపై నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ సానుకూల సిఫార్సులను అమలు చేయని కోరారు. గతంలో నిరవధిక సమ్మెకు నాయకత్వం వహించినందున మహదేవయ్యను ఉద్యోగం నుంచి తొలగించిన తగదన్నారు. కార్యక్రమంలో శేషిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.